రంగసీతమ్మ

"శ్రీరాగి"

జానకి ఉబుసుపోకకి వాకిట్లో గుమ్మం దగ్గర నిలబడి రోడ్డువెంబడి వచ్చి పోయే జనాన్ని పరిశీలిస్తున్నది. పదిగజాల దూరాన ఉన్న రామారావుని చూసి ఇంట్లోకి పోయి,

"అమ్మా, మామయ్యా మన ఇంటికి వస్తున్నారే" అని తల్లితో చెప్పింది.

రామారావు జానకిమామ, సుమారు నలభై ఏళ్లుంటయి.

ఇంట్లోకి వస్తున్న రామారావుని జానకి తల్లి సుందరమ్మ చూసి "రండి, అన్నయ్యా" అని ఆహ్వానించి, కుర్చీ చూపించింది కూర్చోడానికి.

"అన్నయ్యా, 'ఇదేనా రావటం ఊరి నుంచీ." అని అడిగింది సుందరమ్మ.

"అవునే. రాజమండ్రినుంచి, ఇప్పుడే వస్తున్నా. అంతా కులాసా ?"

"అంతా కులాసే నన్నయ్యా. అక్కడ, ఒదిన, పిల్లలు, క్షేమమేనా ?"

"ఆహా !"

"ఇంకా ఏమిటి సంగతులు?" అన్నాడు రామారావు.

"సంగతు లేమున్నయి నీకు తెలీనివి ? ఇట్లా ఉన్నాం."

"జానకి బాగా ఎదిగిందే. దీని కిప్పుడెన్నో యేడొచ్చిందంటావు ?"

"మొన్న నే పదమూడో ఏడొచ్చింది"

"అయితే పెళ్ళీడు కొచ్చిందన్నమాటే. ఏమయినా సంబంధాలు చూస్తున్నారా?"

"అప్పుడే?"

"ఇంకా అప్పుడే నంటా వేమిటే సుందరం? మన కుటుంబం, 'మన సాంప్రదాయం చూసుకోవక్కర్లా? ఇంకా ఆగుతే రేపు అది సమర్తాడి కూర్చుంటే మన కప్రతిష్ఠకదూ నలుగురిలో?"

"ఇప్పుడంతా సమర్తాడిన తర్వాతే చేస్తున్నారుగా పెళ్ళిళ్లు?"

"కొంపముంచి నీ కూతురికికూడా అలా చేద్దామనుకొంటున్నావా?"

"నేననుకోటానికి కాదు. మాకుటుంబం పరిస్థితులు నీకు తెలీని దేముంది? మీ బావగారి సంపాదన కూడు, గుడ్డకే సరిపోకపోతుంటే, పెండ్లేం చేస్తారు?"

"అందుకని ఎదిగిన పిల్లని ఇంట్లో అట్టే పెట్టుకొంటారా?"

"మరేం చెయ్యమంటా వన్నయ్యా?"

"ఏదో దొరికిన సంబంధం చూసి, గంతకు తగ్గ బొంత అని ముడిపెట్టాలిగాని, చేతులు ముడుచుకు కూర్చుంటే ప్రయోజన మేముంది?"

"ఏదో మీ అందరి సహాయం వుంటే, పెండ్లి ఎంతలో కవుతుందిలే అన్నయ్యా"

"సరే, మా సహాయాని కేం లే. ఈ రోజుల్లో ఎవరి సంపాదన వాళ్ళకి సరిపోక నానా అవస్థ పడుతుంటే ఇంకోళ్ళకి సహాయం ఎలా చేస్తారు సుందరమ్మా? నీవు యింకా పూర్వకాలం మాటలు మాట్లాడుతున్నావు. చూడు, నాకు నెలకు నాలుగు వంద లొస్తోంది అన్నమాటే గాని, పదో తారీక్కు మళ్లీ నేను అప్పుకు బయలుదేరాల్సిందే, రోజుకి రెండు శేర్లు పాలు, నెలకి నలభైఅయిదు రూపాయలు. కాఫీపొడుం ఇరవై రూపాయలు. ఇట్లాగే అన్ని ఖర్చులూ. ఎంత చెట్టు కంత గాలి."

"అవునులే అన్నయ్యా" అంది నిస్పృహతో సుందరమ్మ.

"అయితే నే యింక వస్తా బావతో చెప్పు ఏదో ఒక సంబంధం చూసి జానకికి పెళ్ళి చేయమని. ఈ రోజుల్లో అన్నీ కలిసిన సంబంధాలు రావు. యేదో ఒక లోపం ఉంటూనే ఉంటుంది. చదువూ, డబ్బూ, అందం, అన్నీ ఉంటే, పెండ్లికొడుకు రెండో పెళ్ళి వాడవుతాడు. డబ్బుంటే చదువుండదు, చదువుంటే డబ్బుండదు అన్నీ ఉంటే కురూపిగా ఉంటాడు పెళ్లికొడుకు. ఏదో ఒకటి సరిపెట్టుకోవాలి. సరే : ఇట్లా అన్నానని బావతో చెప్పు. నా కవతల అర్జంటుపనుంది పోయొస్తా."

"భోజనంచేసిపో అన్నయ్యా ఈపూట. ఎంత బీదవాళ్ళమైనా ఒకపూట భోజనం పెట్టలేకపోంగా ?"

"దానికిగాదు సుందరం. ఈమాటొచ్చి నప్పుడొస్తాగా. వెళ్ళొస్తా. జానికి పెళ్లి విషయం మాత్రం తొందర చెయ్యిబావని. లేకపోతే మనకి నలుగురిలో తలవంపులు. వస్తా" అంటూ చెల్లెలు సుందరమ్మను

చుట్టపుచూపుగా చూసి వెళ్లాడు రామారావు.

రామారావు, సుందరమ్మ ఒక తండ్రి బిడ్డలు. రామారావు అదృష్టవంతుడవటంవల్ల వ్యాపారంలో ఎలాగో డబ్బు సంపాదించి

భాగ్యవంతుడయ్యాడు. సుందరమ్మ సంసారం బీదకుటుంబంగానే ఉండిపోయింది. సుందరమ్మ భర్త రాజారావు చిన్న ప్రభుత్వోద్యోగి.

పది గంటలకు రాజారావు భోజనం చేసి ఆఫీసుకు పోదామని ఇంటికి వచ్చాడు.

రాజారావు భోజనం చేస్తున్నాడు.

"ఏమండీ, ప్రొద్దున మా అన్నయ్య వచ్చాడు." అంది సుందరమ్మ.

"మీ అన్నయ్య వచ్చాడా? మరి ఎక్కడా కనపడడేం?" అన్నాడు రాజారావు.

"అప్పుడే వెళ్ళిపోయినాడు."

"ఏమంత అర్జంటు? భోజనానికి ఉండమనలే?"

"అన్నానండీ, అర్జంటుపనుంది, మళ్లీ వస్తాలే అని వెళ్ళాడు."

"అయితే మరేమిటి సంగతులు?"

"ఒదినా వాళ్ళంతా కులాసాగానే ఉన్నారట."

"ఇంకా?"

"ఇంకా ఏం లేదు. అమ్మాయి జానకి విషయం మాట్లాడేడు."

"ఏమన్నాడు?"

"జానకి పెంట్లీడు కొచ్చిందట."

"అప్పుడే! ఇంకా నయం. దాని కింకా న్నెండేళ్లు నిండందే."

"మొన్ననే వచ్చిందండీ, పదమూడో ఏడు."

"మరేం ఫర్వాలేదు. జానకి పెండ్లికి ప్పుడేం తొందరలేదు ఇంకా నాలుగయి ఏళ్ళు చక్కగా దాన్ని చదువుకోనీ."

"అది ఇంకో సంవత్సరంలోనే పెద్ద వుతుందేమో?"

"అవనీ? లోకంలో అందరూ కావ ంలా, అలాగే మన పిల్లానూ."

"అదిగాదండీ, పెద్దమనిషి కాకముందే పెండ్లిచెయ్యాలన్నాడన్నయ్య. లేకపోతే లుగురిలో తలవంపులట."

"మీ అన్నయ్య వచ్చినప్పుడల్లా ఏదో క బెడద తెచ్చిపెడుతూనే ఉంటాడు. ారకరారు మహాత్ములన్నారులే. ఆయన కేం—చెపుతాడు. నా పరిస్థితిలో ఆయ ంటే తెలిసొస్తుంది. ఇంకా ఏమన్నాడు?"

"మంచి సంబంధం అని చూచుకొంటే కుదరదు. ఏదో ఒకటి చూసి ముడి పెట్టమన్నాడు."

"ఓహో ఎదుటివాళ్ళకి శ్రీరంగనీతులు న్నయినా చెప్పొచ్చు. చూస్తాగా. రేపు న కూతురి పెళ్ళి ఎలా చేస్తాడో. తన గ్గరికి వచ్చేటప్పటికి గాని తెలీదులే."

"ఆయనన్నాడని కాదుగాని, ఎదిగిన పిల్లని ఎన్నాళ్ళని ఇంట్లో ఉంచుకొంటామండీ? నలుగురూ నవ్వరూ?"

"ఇంకేం బాగా తలకి పిచ్చి ఎక్కించి పోయ్యాడు. ఇక నన్ను వేధించుకు తింటావు."

అని భార్యమీద విసుక్కుంటూ రాజారావు భోజనం ముగించి లేచాడు.

రాజారావు కాళ్లు అరిగేటట్టు తిరిగి ఏదో సంబంధం కుదుర్చుకొని కూతురికి పెండ్లి చేసేడు. పెండ్లి అయ్యేటప్పటికి ఆయన చాలా బాధలు పడాల్సొచ్చింది. కాని సంఘానికి వెరచి ఎట్లాగో పెండ్లిఅయిందనిపించాడు.

* * *

అయిదు సంవత్సరాలు గడిచినవి.

సుందరమ్మ రామారావునిచూడటానికి వాళ్ళ యింటికి వెళ్ళింది.

రామారావు సుందరమ్మ మాట్లాడుకొంటుంటే రామారావు కూతురు పుష్ప, సుందరమ్మ దగ్గరకు వచ్చికూర్చున్నది.

"ఏమన్నయ్యా. పుష్ప కెప్పుడు పెళ్ళి చేస్తావు? ఇంకా రెండు మూడు నెలలలో పెద్దమనిషి అయ్యేటట్టుంది" అంది సుందరమ్మ.

పుష్ప సిగ్గుపడి నవ్వుకొంటూ లోపలికి వెళ్ళిపోయింది.

"ఆఁ ఇప్పుడేం తొందరలేవే, ఏదో ఫోర్తుఫారం చదువుకొంటున్నది. ఆ స్కూలు ఫయినలు కాస్తా అయిపోతే పెండ్లి చేసెయ్యొచ్చు. అదెంతసేపు పని?"

"అయితే అన్నయ్యా. పెద్దమనిషయినా ఇంట్లో పెట్టుకొంటావా? నలుగురూ యేమనుకొంటారు?"

"ఇంకా ఈ రోజుల్లో ఏమిటే. అయినా నలుగురూ అనుకొనిపోతారని మన పిల్ల చదువు మధ్యలో మానుకొంటామా?"

"అయితే సీత తండ్రి దాని కప్పుడే చదువు ఆపించి పెండ్లి చేసేడు గదా? ఆయనకన్న నీవేం ఎక్కువవాడివా?"

"అదేమిటే. ఆయన కూతురి పెళ్ళికీ, నా కూతురు పెళ్ళికీ సంబంధ మేమిటి? ఆయన కిష్టమయింది. పెళ్లి చేసేడు. నా కిష్టమయినపుడు, నాకు సబబని తోచినపుడు నా కూతురికి పెండ్లి చేసుకుంటాను, ఊళ్ళోవాళ్ళెవరు మధ్య నన్నడగటానికి?"

"నలుగురితోపాటే మనమూ గదా అన్నయ్యా? ఊళ్ళో నలుగు రొకదారీ, నీవొక దారీనా?"

"అది కాదే సుందరం. నువ్వు లక్ష చెప్పు. పెళ్లిచేసేది నేనుగదా. వాళ్ళేమన్నా మనకి పీసమెత్తు సహాయం చేస్తారా? ఏమిటో లేవే, సంఘం, పరువు మర్యాదా అని పెట్టుకొంటే మనకి తూగద్దూ?"

"అంతే నంటావా అన్నయ్యా" అంది సుందరమ్మ, తన అన్నయ్య మారిపోయిన సిద్ధాంతాని కాశ్చర్యపోతూ.

ఇంకా అయిదు సంవత్సరాలు గడిచినవి. ఇప్పుడు పుష్ప కాలేజీలో చదువుతున్నది బియ్యే.

"ఏమన్నయ్యా, పుష్పకి పెండ్లిచేసేదేమన్నా ఉందా లేదా? నలుగురూ యేమనుకొంటున్నారో తెలుసా?"

"ఆఁ ఏమనుకొంటున్నారే? నా కూతురు చదువుకొంటుంటే వాళ్ళకేం? చూడలేని లోకం యేమయినా అంటుందిలే."

"వాళ్లనుకొంటున్నవన్నీ నీ కేమని చెప్పమంటావన్నయ్యా. వినటానికి నాకే అసహ్య మేసింది. ఎందుకీ గొడవ? యెవ

ఒక ప్రఖ్యాత సినిమాతార ఒకనాటి వుదయం తనకు ప్రేక్షకలోకం వ్రాసిన వుత్తరాలను పరిశీలిస్తున్నది.

వేయికిమించి వున్న వుత్తరాలలో 999 యించుమించు అన్నీ ఒకే ధోరణిలో వున్నాయి.

కానీ-ఆ చివరి వుత్తరంలో మాత్రం యిలా వున్నది.

"మీారు యిటీవల నటించిన "..." చిత్రం నిన్నరాత్రి చూశాను. అందులో మీారు నవ్వినఆనవ్వు చాలా బాగుంది. కానీ, మీా నోట్లోవున్న పళ్లు అన్నీ పెట్టుడు పళ్లేనని తెలిసిపోతున్నది."

నరమానవుడెవ్వడూ కనిపెట్టలేని యీా రహస్యాన్ని కనిపెట్టిన యీాఘనుడు ఎవరా అని ఆమె కొంచెం గాబరా పడింది. ఆ వుత్తరం వ్రాసినవారెవరో అని వుత్తరంఅంతా వెతికిచూసింది.

వుత్తరానికి పైభాగాన యిలా వున్నది.

డాక్టర్......
దంతవైద్యుడు.

శ్రీరంగనీతులు

(7-వ పేజీ తరువాయి)

డికో చూసి చేసెయ్యగూడదూ ?" అంది సుందరమ్మ.

"పెండ్లి అంటే అంత తేలికగావుందిటే. కట్టుకొన్న మొగుడితో జీవితాంతందాకా ఏడవాలంటే వరుణ్ణి ఎంత జాగ్రత్తగా యేరుకోవాలి. అన్నీ చూసుకోవాలి, చదువూ, డబ్బూ, అందం అన్నీ చూడకపోతే, పిల్లగొంతు కొయ్యటమేగా."

"అన్నీ కుదరాలంటే కష్టంకాదన్నయ్యా. అందులో ఇరవైయేళ్ళొచ్చిన దాన్నెవరు చేసుకుంటారు. బెండకాయ ముదిరినా బ్రహ్మచారి ముదిరినా పనికిరాదన్నారు గదా ?"

"అందుకని చూస్తూ చూస్తూ, దాని గొంతు కోసెయ్యమంటావుటే ?"

"అని నే అన్నానా అన్నయ్యా. ఏదో మంచి సంబంధం చెయ్యాలన్నా కాని"

"ఇంతకీ పెళ్ళొచ్చినా, కర్కొచ్చినా ఆగదన్నారు. నువ్వు, నేనూ తొందరపడితే సరా ?"

"అంతేలే అన్నయ్యా" అంది సుందరమ్మ చిటకారంగా—హడావుడిగా, బలవంతంమీాద జరిగిన తన కూతురి పెండ్లి తలచుకొంటూ. ★

కాలక్షేపం

(5-వ పేజీ తరువాయి)

యీాసంసారమనే మట్టిబురదకంటె, ఉన్నతమైన జీవిత ఆదర్శములు, నక్షత్రాలవలె, తారలవలె కన్పించాయి. భారతభూమిలోని కర్మయోగులకు ఆ తారకమార్గం ఆకాశవీధిలో కన్పించడమే కాదు. ఆదర్శమాత్రమే కాకుండా ఆ తారకమార్గం వారికి కరతలామలకమై అనుభవైకవేద్యమై ప్రత్యక్షప్రమాణమైంది.

ఇటువంటి కర్మభూమిలో ఆధ్యాత్మిక ప్రమేయంలేనట్టి జీవితవ్యాపారంగాని కర్మగాని ఉండడం అసంభవం. *"I have come to spiritualize politics"* (రాజకీయరంగాన్ని ఆధ్యాత్మిక తత్వనిమగ్నం చేయడానికి నేను వచ్చాను)అని గాంధి మహాత్ముడు తన సత్యాగ్రహ ఉద్యమం ప్రారంభించక పూర్వము నాగపూరు కాంగ్రెసు సభలో ఉపన్యసిస్తూ అన్నాడు. ఆయన సాధించిన స్వరాజ్యం "హర్తాళ్ "తో (హరితాళ్ =హరిభజనతో) ఉపవాసాలతో, భగవత్ప్రార్థనలతో, ఆత్మబలంతో సాధించాడు. ఆయన సాధించినదిగాని, ఆయన సంకల్పించినదిగాని *"Secular Government"* భౌతికరాజ్యం కాదు. రాజకీయస్వాతంత్ర్యం,—దానిమూలంగా ఆర్థికస్వాతంత్ర్యం, ఆధ్యాత్మిక స్వాతంత్ర్యం సాధించాలని ఆయన "రఘుపతి రాఘవ రాజారాం! పతితపావన సీతారాం! ఈశ్వర అల్లా తేరేనాం! సబ్‌కో సన్మతి దే భగవాన్" అని జపించి మననం చేశాడు.

వేలకొలది సత్యాగ్రహులు ఆయన అడుగుజాడల నడచి, లాఠీదెబ్బలు తిని, జెయిళ్లకువెళ్లి, కృశించి, ప్రాణాలర్పించినది దేనికోసం ? భౌతికరాజ్యంకోసం కాదు. బంగారు నాగళ్లతో భూమిని దున్నడం జిల్లేడుదూది పండించడం కొరకా? మంచి గంధపుచెక్కలను కాల్చి నవరత్నఖచిత పాత్రిలో మనము వండినది తెలక పిండియేనా?

కమ్యూనిస్టులు కోరేదికూడా ఆర్థిక స్వాతంత్ర్యమే. కాని ఈ కర్మభూమిలో అంతకంటె ఎక్కువైన ఆత్మస్వాతంత్ర్యం పెరిగి పెంపొందాలి. అదే మనకు మహర్షులిచ్చిన విభూతి. అట్టి మహాత్ముల భస్మరాసులతో పవిత్రమైన భారతభూమి ఇది దీనికి మించిన దేశమింకొకటి లేదు.

"యతుల విభూతి దాల్తు విల-
సమ్మరో! నీసరి ధన్యలుందురే!"
మహాత్మా గాంధీకీ జై!
భారతమాతకీ జై! ★

కీ. శే. యస్. జి. ఆచార్యగారు

ఆంధ్ర దేశానికి చిరపరిచితులు, సుప్రసిద్ధ పత్రికా రచయిత అయిన శ్రీ యస్. జి. ఆచార్యగారి అకాల మృతివల్ల సంసారమ్ వ్యాసావళి నిలిపివేయ వలసి వచ్చినదని మా పాఠకులకు తెలియపరచుటకు చింతించుచున్నాము. తెనుగు పత్రికా ప్రపంచానికి శ్రీ ఆచార్యగారు చేసిన సేవ అమూల్యమైనది. పత్రికా రచనకు జీవితాన్ని అంకితం చేసిన శ్రీ ఆచార్యగారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థించుచున్నాము. సం.